www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 21 సెప్టెంబర్ 2023

5

అన్నమయ్య



జిల్లా ఆస్పత్రిలో కేంద్ర బృందం తనిఖీలు

మదనపల్లె అర్బన్: జిల్లా ప్రభుత్వాసుపత్రిని బుధవారం కేంద్ర బృందం సభ్యులు డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ సిహెచ్ పాదాలు ఆసుపత్రిలో రోగులు అందుతున్న వివిధ రకాల సేవలపై తనిఖీ చేశారు. జిల్లా ఆస్పత్రిలో రోగులకు మధ్యాహ్న భోజనం సదుపాయం సక్రమంగా లేదని వైద్య బృందం దృష్టికి రోగులు తీసుకువచ్చారు. నాసిరకం ఆహారం సరఫరా చేస్తున్నారని మెనూ ప్రకారం ఆహారం అందించడం లేదని నిర్ధారించుకున్నారు. అనంతరం అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లు వైద్య సిబ్బందికి పలు రకాల సలహాలు సూచనలు తెలియజేశారు. సిద్ధం చేసిన నివేదికలను కేంద్రానికి సమర్పించనున్నామని వారు మీడియాకు తెలిపారు.



జిల్లా ఆస్పత్రిలో తనిఖీ చేస్తున్న కేంద్ర బృందం

సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం

- 'జగనన్నకు చెబుదాం'లో కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-పెనగలూరు

స్థానిక సమస్యలకు మండల స్థాయిలోనే పరిష్కారం చూపాలని కలెక్టర్ గిరీష తెలిపారు. బుధవారం ఎండిఓ కార్యాలయ ఆవరణంలో కలెక్టర్ అధ్యక్షత మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా ఇప్పటికే అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ లబ్ధి అందిస్తోంది. గ్రామస్థాయిలో చిన్న చిన్న అంశాలు ఏవైనా జిల్లా అధికారుల దృష్టికి రానిచి జిల్లా కేంద్రానికి రాలేని వారి కొరకు మండల స్థాయిలోనే జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి బుధ, శుక్రవారం నాడు ఒక్కొక్క మండల కేంద్రంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులు, మండల అధికారులు అందరూ ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నందున ప్రజలకు అవసరమైన అన్ని సర్వీసులు సులభంగా అందించే అవకాశం ఏర్పడుతోంది. అంతేకాక మండల స్థాయిలో వచ్చిన స్థానిక సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం చూపే అవకాశం ఉంది. సచివాలయాల పరిధిలో కూడా ఏవైనా పరిష్కారం కాని సమస్యలు ఉంటే మండల స్థాయి స్పందన కార్యక్రమంలో తెలియజేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజా పథకం అర్హులు అందాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన ఉద్దేశ్యం. అర్హులైన ఏ ఒక్కరూ లబ్ధి అందలేదని ఆగిపోరాదు. ప్రభుత్వ శాఖల్లో టెక్నికల్ గా ఏదైనా కారణంతో ఆగిపోయిన అంశాలను పరిశీలించి వాటికి తగిన పరిష్కారం సూచించడానికి మండల స్థాయి జగనన్న



సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ గిరీష

కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు అందరూ ఇక్కడికి వస్తారు. మీ సమస్యలన్నిటికి పరిష్కారం చూపుతారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే 1902 టోల్ ఫ్రీ నెంబర్ కు కూడా ఫోన్ చేసి తెలపవచ్చు. ప్రజలందరూ సహకరించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుంచి కలెక్టర్ గిరీష, రాజంపేట ఆర్డిఓ రామకృష్ణారెడ్డి అర్జీలు స్వీకరించి పరిష్కారం కొరకు వాటిని సంబంధిత శాఖల జిల్లా అధికారులకు ఎండార్స్ చేసి సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు విజయరెడ్డి, తహశీల్దార్ శ్రీధర్‌రావు, ఎంపిడిఒ వరప్రసాద్, సర్పంచ్ వెంకట రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల అధికారులు, సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

25న మండల కేంద్రాల్లో ధర్నాలు

- ఎపి రైతు సంఘం, వ్య.కా.స నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

వర్షాభావ దృష్ట్యా కరువు మండలాలను ప్రకటించాలని ఈ నెల 25వ తేదీన మండల కేంద్రాలలో ధర్నాలను జయప్రదం చేయాలని ఎపి రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శులు దస్తగిరిరెడ్డి, అన్వేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఎపి రైతు సంఘం జిల్లా కార్యాలయంలో కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు జిల్లాలో నెలకొన్నాయని తెలిపారు. వర్షాభావ పరిస్థితులు దృష్ట్యా జిల్లాలో కరువు మండలాలను ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితితో రైతులు అరకొర పంటలు వేశారని, అప్పులు చేసి, వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వేసిన పంటలు ఎండు దశకు వచ్చాయని తెలిపారు. పత్తి, వేరుసెనగ, మిర్చి, మొక్క జొన్న, ఆముదం, కంది, మినుము వంటిపంటలు కూడా సకాలంలో వర్షాలు లేక సగానికి సగం దెబ్బతిన్నాయని చెప్పారు. బోరు బావుల కింద ఉన్న అరకొర పంటలను కాపాడుకుందామంటే విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదని పేర్కొన్నారు. విద్యుత్ కోతలతో ఉన్న కొద్దిపాటి పంటలు దెబ్బ తింటుంటున్నాయని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను రూపొందించి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ప్రణాళిక లేమితో చోద్యం చూస్తోందని విమర్శించారు. కనీసం వేసిన పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తోందని పేర్కొన్నారు. ఇ-క్రాప్ నమోదు చేయటంలో కూడా సర్వర్, నెట్‌వర్క్ సమస్య, యాప్ డౌన్లోడ్ కాకపోవడం వంటి కారణాలతో పంటల నమోదు సక్రమంగా చేయటం లేదని తెలిపారు. వర్షాభావంతో పంటలు దెబ్బతిన్న అన్ని ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా గుర్తించి, కరువు సహాయక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

రైతులు, కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటనుబట్టి ఎకరాకు రూ.40 వేలు నుంచి రూ.50 వేల నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. పంటలు వేయని రైతులకు ఎకరాకు రూ.20 వేలు జీవన భృతిగా ఇవ్వాలని పేర్కొన్నారు. రైతులు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని, కౌలు రైతులకు కౌలు రద్దు చేయాలని, వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకంలో అదనంగా 100 రోజులు పనులు పెట్టాలని, వ్యవసాయ మోటర్లకు 9 గంటల విద్యుత్ నిరంతరాయంగా అందించి ఉన్న పంటలను కాపాడాలని తెలిపారు. ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళికను రూపొందించి రబీలో పంటలు వేసేందుకు 90 శాతం సబ్సిడీతో రైతులకు ప్రభుత్వం విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 25వ తేదీన తహశీల్దార్ కార్యాలయాల ఎదుట జరిగే ధర్నాకు రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపు నిచ్చారు. కరపత్రాల ఆవిష్కరణలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

వైవీయూ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న విసి సుధాకర్

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయ పీజీ సెమిస్టర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డితో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విసి విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని ఆర్ట్స్ బ్లాక్, సైన్స్ బ్లాక్, కామర్స్, మేనేజ్మెంట్ బ్లాక్‌లో జరుగుతున్న పరీక్షలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. విశ్వవిద్యాలయం పరీక్షల సంస్కరణలు తీసుకొచ్చిందని, వికేంద్రీకరణ విధానం అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. తద్వారా ఫలితాలు త్వరగా విడుదలై విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో మూడు కేంద్రాల్లో పరీక్షలు ప్రారంభమయ్యాయని చెప్పారు. తొలి రోజు రెండవ సెమిస్టర్ నాన్ కోర్ పరీక్ష నిర్వహించామని తెలిపారు. గురువారం నుంచి నాలుగో సెమిస్టర్ విద్యార్థులకు పరీక్షలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. మరోవైపు విశ్వవిద్యాలయ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య ఎస్.రఘునాథ్ రెడ్డి పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణలో అన్ని శాఖల సహాయ ఆచార్యులు, సహ ఆచార్యులు, ఆచార్యులు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్ల సమస్యలు తెలియజేయాలి : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గిరీష

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లాలో పోలింగ్ స్టేషన్ల సమస్యలు ఉంటే వెంటనే తెలియజేయాలని కలెక్టర్ గిరీష రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాలులో ఓటర్ల జాబితా పరిశీలనపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ గిరీష పిఎస్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పోలింగ్ స్టేషన్ల చేర్పులు మార్పులు, తదితర సమస్యలపై వెంటనే తమకు తెలియజేయాలన్నారు. ఓటరు జాబితా ఇంటింటి పరిశీలన దాదాపు పూర్తి అయిందన్నారు. డెత్, షిఫ్టెడ్, రిపీటెడ్ ఓట్లను ఒకటికి రెండుసార్లు పరిశీలించడం జరిగిందన్నారు. జిల్లాలో ఓటర్ జాబితాకు సంబంధించి అందిన క్లెయిమ్స్ అండ్ అబ్జెక్షన్స్ పక్కాగా పరిశీలన చేస్తున్నామన్నారు. కావున రాజకీయ పార్టీల ప్రతినిధులందరూ తప్పులు లేని స్వచ్ఛమైన ఓటరు జాబితా రూపకల్పనకు కృషి చేయాలన్నారు. జిల్లాలో డిలీట్ అయిన ఓట్లను బిఎల్వోలు పోలింగ్ స్టేషన్ వారీగా పరిశీలించామన్నారు. జంక్ ఓటర్లను పరిశీలిస్తున్నామని ఇంకా ఎక్కడైనా ఒకే డోర్ నెంబర్లో 10 కంటే ఎక్కువ ఓట్లు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. జిల్లాలో మొత్తం1577 పోలింగ్ స్టేషన్లు, 1577 బిఎల్ఓలు ఉన్నారన్నారు. ఓటర్లకు సంబంధించి 668552 మంది పురుషులు, 685071 మహిళలు,136 ఇతరులు మొత్తం1353759 మంది ఓటర్లు ఉన్నారన్నారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహాయ సహకారాలు అందించి అన్నమయ్య నూతన జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం నియోజకవర్గాల వారీగా వివిధ అంశాలపై రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలెక్టర్ చర్చించారు.కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్ఒ సత్యనారాయణ, రాయచోటి, రాజంపేట, మదనపల్లి ఆర్‌డిఒలు రంగస్వామి, రామకృష్ణారెడ్డి, మురళి, తహశీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యార్థిని అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపల్ యువరాజ్

రాష్ట్ర స్థాయి యోగా పోటీలో 'మిట్స్' విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ కళాశాల బి.టెక్ చివరి సంవత్సరం ఇఇఇ చదువుతున్న డి.అరవింద్ రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ కనపరిచినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అఫ్ ఆంధ్ర ప్రదేశ్ వారు కర్నూల్‌లో 48వ ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ ఛాంపియన్ షిప్ 2023 నిర్వహించిందని అందులో రెండవ స్థానంలో నిలిచి ప్రతిభ కనపరిచినట్లు పేర్కొన్నారు. డి.అరవింద్‌ను కళాశాల కరెస్పాండెట్ డాక్టర్ విజయభాస్కర్‌చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ సి.యువరాజ్, ఫిసికల్ డైరెక్టర్ దామోదరన్ తదితరులు అభినందనలు తెలియాజేశారు.

బిటి కాలేజీలో పీజీ కోర్సులు

మదనపల్లె అర్బన్: స్థానిక బెసెంట్ థియోసాఫికల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రెగ్యులర్ అధ్యాపకులు బదిలీపై వచ్చినందువలన ఈ సంవత్సరం నుండి పీజీ కోర్సులను పునఃప్రారంభించునునట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.ఆనంద్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరానికిగాను ఎంఎ (ఎకనామిక్స్), ఎంకామ్ కోర్సులను రెగ్యులర్ కోర్సులుగాను, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, మరికొన్ని కోర్సులను సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు గాను ప్రవేశపె డుతున్నామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నేటి శ్రీవెంకటేశ్వర యూనివర్సిటీ వెబ్సైట్లో ఆప్షన్స్ పెట్టుకొని ఈ సువర్ణఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని కోరారు.

గ్లాసు గుర్తు కేటాయించడం హర్షణీయం

మదనపల్లె అర్బన్: జనసేన పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం గాజు గ్లాసు గుర్తు కేటాయించడంపై కేంద్ర ఎన్నికల సంఘానికి జనసేన పార్టీ లీగల్సేల్ విభాగానికి జనసేన పార్టీ రాయలసీమ దక్షిణ కోస్తా సంయుక్త పార్లమెంటరీ సమన్వయకర్త స్టేట్ ఫైనాన్స్ కమిటీ సభ్యులు డాక్టర్ మై ఫోర్స్ మహేష్ కృతజ్ఞతలు పేర్కొన్నారు. బుధవారం స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మెఫోర్స్ మహేష్ మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం జనసేన పార్టీకి గాజు గ్లాస్ గుర్తు రాకుండా అడ్డుకోవడం కోసం ఎన్నో పన్నుగాలు పన్నిన కేంద్ర ఎన్నికల సంఘం రాజ్యాంగానికి లోబడి జనసేన పార్టీకి గాజు గ్లాస్ గుర్తు కేటాయించడం ఎంతో అనందగా ఉందన్నారు. వచ్చే ఎన్నికల్లో జనసేన పార్టీ సాధించబోయే విజయానికి సంకేతంగా ఉందన్నారు. నీతి నిజాయితీ అవినీతి లేని రాజకీయాలు కేవలం జనసేన పార్టీ అధినాయకుడు పవన్ కళ్యాణ్‌కే సాధ్యమన్నారు. జనసేన, టిడిపి ప్రభుత్వం రాకపోతే రాష్ట్రం అధోగతి పాలవుతుందని కావున ప్రజలందరూ జనసేన టిడిపి ప్రభుత్వాన్ని గెలిపించాల్సిందిగా విజ్ఞప్తించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ లీగల్ సెల్ అధ్యక్షులు అమర్ నారాయణ, జనసేన పార్టీ నాయకులు రామ్మూర్తి చిరంజీవి, లక్ష్మీపతి, రమణ, పవన్, నరేష్, సల్మాన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహేష్

కొనసాగుతున్న రిలే నిరాహారదీక్షలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

చంద్రబాబు అరెస్టుకు నిరసనగా టిడిపి చేపట్టిన రిలేనిరాహార దీక్షలు కొనసాగుతూనే ఉన్నాయి. బుధవారం నాటికి దీక్షలు 8వ రోజుకు చేరుకున్నాయి. పట్టణంలోని అన్నమయ్య సర్కిల్‌లో దొమ్మలపాటి యశశ్వి రాజ్, చాణక్య తేజల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాబుకి తోడుగా, నియంతపై పోరాటానికి మేము సైతం రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్,బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మోడెం సిద్ధప్ప, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు,రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు నీలకంఠ, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి మేకల రెడ్డి శేఖర్, మదనపల్లి టౌన్ అధ్యక్షులు భవాని ప్రసాద్ పాల్గొన్నారు. **రాజంపేట అర్బన్ :**తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుపై పెట్టిన అక్రమ కేసులను, అక్రమ అరెస్టును తీవ్రంగా ఖండిస్తూ మేము సైతం బాబు కోసం ఒక నియంత పై పోరాటానికి అంటూ మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్ రాయుడు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. దీక్షలో జనసేన పార్టీ నాయకులు, మాజీ ఆర్టీసీ రీజనల్ మేనేజర్ వెంకటేశ్వరరావు, టి.సుండుపల్లి మండల జనసేన పార్టీ అధ్యక్షులు రామా శ్రీనివాసులుతో పాటు పలువురు నేతలు పాల్గొని చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా మద్దతు తెలిపారు. దీక్షా శిబిరంలో పాల్గొన్న టిడిపి నేతలతో కలసి బత్యాల తన స్వహస్తాలతో రాసి పెద్ద సంఖ్యలో రాజమండ్రి సెంట్రల్ జైలుకు పోస్ట్ కార్డులను పంపించారు. కార్యక్రమంలో పట్టణంలోని పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు, అనుబంధ కమిటీల పదాధికారులు పాల్గొన్నారు. **ములకలచెరువు :**తెదుపా అధ్యక్షుడు చంద్రబాబునాయుడు పెరిగిన జన ఆదరణ చూసి అధికార పార్టీ నాయకులు ఓర్వలేక స్కిల్ డెవలప్మెంట్లో అక్రమ కేసులు బనాయించి అరెస్ట్ చేయడం దారుణమని మండల తెదేపా నాయకులు నరసింహరెడ్డి, మౌలా, సుధాకర్నాయుడు అన్నారు. మండల టిడిపి కన్వీనర్ పాలగిరి సిద్ధ అధ్వర్యంలో దేవుళచెరువు, పర్తికోట, బురకాయలకోట, చౌడసముద్రం గ్రామాల్లో నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు జెసిబి సుధాక్నాయుడు, శంకరనారాయణ, సుదర్శన్, సుధాకర్నాయుడు, శ్రీనివాసులు, జయరాం, ప్రతాప్, చంద్ర, నాగమల్లప్ప, రామాంజులు, శంకరప్ప పాల్గొన్నారు.

ఒపిఎస్‌ను పునరుద్ధరించాలి : ఎపిటిఎఫ్

కడప అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు జిపిఎస్ విధానం అమలు చేయడానికి రాష్ట కేబినెట్ ఆమోదం తెలపడం వల్ల ఉద్యోగులకు ఎలాంటి ప్రయోజనం ఉండదని, సిఎం హామీ ఇచ్చిన విధంగా పాతపెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిపిఎస్ విధానాన్ని ఉద్యోగులందరూ వ్యతిరేకి స్తున్నారని ఈ విధానాన్ని ఎపిటియఫ్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు.

660 జిఒను రద్దు చేయాలి

చింతకొమ్మదిన్నె: పంటల బీమాపై ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నెంబర్ 660ని వెంటనే రద్దు చేయాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి దస్తగిరిరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక సచివాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2023-24 పంటల బీమాలో ప్రయివేట్ ఇన్సూరెన్స్ కంపెనీల ప్రవేశం నిలిపివేయాలన్నారు. ప్రభుత్వమే పంటల బీమా అమలు చేయాలన్నారు. 2023-24 ఖరీఫ్ సీజన్‌లో పంటల బీమా అమలుకు ప్రభుత్వం ఇన్సూరెన్స్ కంపెనీలతో బిడ్డింగ్ నిర్వహించిందిన్నారు. 2020 నుండి 2023 వరకు మూడు సంవత్సరాల పంటల బీమా అమలు అనుభవం పరిశీలిస్తే ప్రభుత్వం నేరుగా పంటల బీమా అమలు చేసిన 2020-21లో రూ.1700 కోట్లు, 2021-22లో రూ.2,900 కోట్లు రైతులకు పంటల బీమా రూపంలో ప్రయోజనం కలిగిందని పేర్కొన్నారు. 2022-23లో ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు జరిగిన పంటల బీమా పథకం వలన రైతులకు కేవలం రూ.1100 కోట్లు మాత్రమే బీమా పరిహారం వచ్చిందని తెలిపారు. పంటల బీమా పథకం ప్రభుత్వమే తన బాధ్యతగా అమలు చేయాలన్నారు. 2022-23 సంవత్సరంలో పంటలు నష్ట పోయినా పంటల బీమా అమలు కాని రైతులు అందరికీ పంటల బీమా పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలిని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోపాలకృష్ణయ్య, చింతకొమ్మదిన్నె మండల రైతు సంఘం నాయకులు శ్రీనివాసులురెడ్డి, చిన్న సిద్దయ్య, రంగారెడ్డి, వై.సిద్దయ్య పాల్గొన్నారు



సమావేశంలో మాట్లాడుతున్న రవిచంద్రబాబు

ఆయిల్ ఫామ్ సాగుపై ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ప్రత్యామ్నాయ పంటగా ఆయిల్ ఫామ్ సాగు చేస్తే ప్రోత్సాహకాలు అందజేస్తామని జిల్లా ఉద్యాన అధికారి రవిచంద్ర బాబు అన్నారు. బుధవారం ఉద్యాన శాఖ, సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ఆధ్వర్యంలో రైతు శిక్షణ కేంద్రం, రాజంపేటలో 'ఆయిల్ ఫామ్ సాగుపై' డివిజనల్ స్థాయిలో రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్ ఫామ్ పంట సాగుకు ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. జిల్లాలో రాజంపేట, నందలూరు, పెనగలూరు, కోడూరు, చిట్వేలు, ఓబులవారిపల్లి, పుల్లంపేట మండలాలలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి 100 హెక్టారుల లక్ష్యాన్ని కేటాయించారని తెలియజేశారు. రైతులు హెక్టార్ కు 143 మొక్కలు నాటుకోవాలన్నారు. ఉద్యాన శాఖ నుండి స్వదేశీ రకానికి హెక్టార్ కు రూ 20,000, దిగుమతి రకానికి రూ.28000 రాయితీని కల్పిస్తుందన్నారు. పంట సాగు ఖర్చులకు మొదటి నాలుగు సంవత్సరాలకు ప్రతి సంవత్సరం హెక్టారుకు రూ.5,250 చొప్పున మొత్తం రూ.21 వేలు, అంతర్ పంటలు పండించినందుకు నాలుగేళ్లకు హెక్టారుకు రూ.21 వేలు రాయితీ కల్పిస్తుందని తెలిపారు. ఆయిల్ ఫామ్ నాటిన మొదటి 4 నుంచి 8 ఏళ్ల పాటు ఎకరాకు 6 నుంచి 7 టన్నులు దిగుబడి, 8 ఏళ్ల పైబడిన తోటల్లో ఎకరానికి 8 నుంచి 12 టన్నులు దిగుబడి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగును ప్రోత్సహిస్తూ బిందు సేద్య పరికరాలు కూడా సన్న ,చిన్న కారు రైతులకు 90 శాతం, ఇతర రైతులకు 50 శాతం రాయితీని కల్పిస్తుందని తెలియచేశారు. ఆసక్తి గల రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఉద్యాన అధికారి జి.సురేష్ బాబు, సువెన్ ఆగ్రో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్లు కొండారెడ్డి, మల్లిఖార్జున్ రెడ్డి, రాజంపేట, నందలూరు, పెనగలూరు మండలాల వి.ఏ.ఏ.లు, విహెచ్ఎలు, ఎంపిఇఒలు పాల్గొన్నారు.

బ్రౌన్ గ్రంథాలయానికి పుస్తకాలు బహూకరణ

కడప అర్బన్ : అనంతపురానికి చెందిన విశ్రాంత తెలుగు అధ్యాపకులు డాక్టర్ అవధానం నాగరాజారావు బుధవారం తన స్వగృహంలోని 400 పుస్తకాలను సిపిబ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం గ్రంథపాలకులు జి.హరిభూషణరావు, సిబ్బంది నీలకంఠేశ్వర్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా సంచాలకులు ఆచార్య తప్పెట రామప్రసాదరెడ్డి మాట్లాడుతూ డాక్టర్ అవధానం నాగరాజారావు బహూకరించిన అమూల్యమైన గ్రంథాల్లో ఆనందభైరవి, శ్రీవిద్యాస్తుతి, శ్రీమహాభాగవత హృదయం, వేదజ్ఞానం, మూడుకాళ్ళ మేక, శ్రీమదాంధ్ర రామాయణం, రామాయణంలోని కొన్ని ఆదర్శపాత్రలు, మహాకవి గురజాడ, వదరుబోతు, అనూహ్య, భాషా సంస్కృతి, చీకటి సూర్యుడు, గౌరీ కల్యాణం, ఆత్రం పెళ్ళికొడుకు, జీవన గమ్యం, అనంత వ్యాసం, పలుకులమ్మ తోటమాలి, విద్వాన్ విశ్వం పెన్నేటిపాటం ఒకనాడు కావ్యానుశీలన తదితర గ్రంథాలున్నాయన్నారు. గ్రంథాలయానికి పుస్తకాలను బహూకరించిన డాక్టర్ అవధానం నాగరాజారావును వైవీయూ విసి ఆచార్య చింతా సుధాకర్, రిజిస్టర్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య అభినందించారు. సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, గ్రంథపాలకులు ఎన్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్ ఎం.మౌనిక హర్షం వ్యక్తం చేశారు.

ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

విజయభారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, భారతీయ అంబేడ్కర్ సేన (బాస్) సంయుక్తంగా స్థానిక సొసైటీ కాలనీలోని విజయభారతి హై స్కూల్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత గుండె వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గుండె వైద్యంలో ప్రఖ్యాతి గాంచిన నారాయణ హృదయాలయకు చెందిన వైద్య నిపుణులు కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ మంజునాథ్ బాబు, క్లినికల్ కార్డియాలజిస్టు డాక్టర్ కిరణ్ కుమార్‌లతోపాటు నారాయణ హృదయాలయ టెక్నిషన్స్ ఈ వైద్య శిబిరంలో పాల్గొన్నారు. ఈ వైద్య శిబిరానికి 336 మంది హాజరుకాగా, వీరికి ఈసీజీ, ఎకో, బిపి, షుగర్ వంటి గుండె పరీక్షలు చేసి, గుండె వైద్య నిపుణులు స్క్రీనింగ్ చేశారు. 18 మందికి గుండె జబ్బులు ఉన్నట్లు నిర్ధారణ కావడంతో వారిని శస్త్ర చికిత్సల కోసం నారాయణ హృదయాలయకు రెఫర్ చేసుకున్నారు. వీరిలో డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి, నారాయణ హృదయాలయ కోలార్ బ్రాంచ్ నందు ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామని వైద్య నిపుణులు తెలిపారు. విజయభారతి స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతు, బాస్ వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్‌లతో కలిసి డాక్టర్ మంజునాథ్ బాబు, డాక్టర్ కిరణ్ కుమార్, బిజెపి నేత చల్లపల్లి నరసింహారెడ్డి ఈ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంజునాథ్ బాబు మాట్లాడుతూ ఇది భారతీయ అంబేడ్కర్ సేన నిర్వహిస్తున్న 16వ ఉచిత గుండె వైద్య శిబిరమని, ఇప్పటి వరకూ జరిగిన 15 వైద్య శిబిరాలలో నాలుగు వేలా మందికి స్క్రీనింగ్ చేశామని, ఇందులో గుండె జబ్బులు ఉన్నట్లు నిర్ధారణ కాబడిన 436 మందికి వివిధ రకాల సర్జరీలు చేయడం జరిగిందని తెలిపారు. ఆధునిక జీవన విధానంలో గుండె జబ్బుల బారిన పడే వారి సంఖ్య ఎక్కువైందని, కావున గుండె జబ్బుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నలభై ఏళ్లకు పైబడిన వాళ్ళు కనీసం ఆరు నెలలకొకసారి గుండె పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. గుండె జబ్బులు ప్రాణాంతకమే అయినా, ప్రస్తుతం మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చిందని, సరైన సమయంలో జబ్బును గుర్తించి, వైద్యం చేయించుకుంటే, ప్రాణాపాయస్థితి నుండి సులభంగా బయటపడవచ్చునని తెలిపారు. ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసిన భారతీయ అంబేడ్కర్ సేన వ్యవస్థాపకుడు పిటిఎం శివప్రసాద్, విజయభారతి హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సేతులను వీరు అభినందించారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్

ఆరోగ్య సురక్షతో ప్రజలందరికీ వైద్యసేవలు

-నగర పంచాయతీ కమిషనర్ మనోహర్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

ప్రతి ఇంటికీ వైద్యసేవలు అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని నగర పంచాయతీ కమిషనర్ పి.ఆర్.మనోహర్ పేర్కొన్నారు. బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నగర పంచాయతీ పరిధిలోని రెండో సచివాలయం పరిధిలోని బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి పలమనేరు నియోజకవర్గ పరిశీలకులు ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతి వాలంటీర్ వైద్యసిబ్బందితో సమన్వయం చేసుకొని తమ పరిధిలోని ప్రతి ఇంటిని ఆరోగ్య కార్యకర్త, సిహెచ్ఒ సర్వే చేసి, ఆ కుటుంబానికి అవసరమైన వైద్యాన్ని అందించడమే ఆరోగ్య సురక్ష ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ముందుగా క్లస్టర్ వారీగా వాలంటీర్లు ఆయా కుటుంబాలను ఆరోగ్య సురక్షపై అవగాహన కల్పిస్తారని,అనంతరం ఎఎన్ఎం లేదా సిహెచ్ఒ ఆ కుటుంబాలను సందర్శించి, వారి పూర్తి వివరాలను ఆరోగ్య యాప్ నందు నమోదు చేస్తారన్నారు. అందరూ సమన్వయంతో పనిచేసి నగర పంచాయతీ పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, భీమిగాని ప్రభాకర్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ రెడ్డిహరి, సచివాలయ కన్వీనర్లు సిఆర్ చిన్నికృష్ణ, జి.చాంద్ బాషా, జీవి రామకృష్ణ, నక్క సంతోష్, వైసిపి జిల్లా ప్రచార కార్యదర్శి అయ్యూబ్‌బాషా, అభిలాష్‌రెడ్డి, సాయి, సద్దాం, రమేష్‌రెడ్డి, ముజీబ్ పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటా సర్వే పారదర్శకంగా నిర్వహించాలని ఎంపిడిఒ సురేంద్రనాథ్ తెలిపారు. బుధవారం గోపిదిన్నె పంచాయతీలో జరుగుతున్న కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ప్రతి కుటుంబంలోని సభ్యులు అందరి ఆరోగ్య పరిస్థితిలను విచారించి సర్వే పూర్తి చేయాలన్నారు.

అన్నదానం గొప్పది

ప్రజాశక్తి-గాలివీడు

పట్టణంలోని స్థానిక బస్టాండ్ ఆవరణలో ఉన్న వినాయక గుడి వద్ద భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కూరగాయల సంతకు వచ్చే ప్రజలకు, రైతులకు ఎంతో ఈరోజు ఉపయోగం పడిందని వెయ్యి మందికి పైగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎగువవల్లిలో పశిరెడ్డిగారిపల్లికి చెందిన కోయిల మండి నాగభూషణం, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కూరగాయల సుబ్బారెడ్డి, వెంకటయ్య, గంగాధర్ నాయుడు, సూరిబాబు, వార్డ్ మెంబర్ ఆనందరెడ్డి, గాలివీడు శ్రీనివాసులు, యువకులు పాల్గొన్నారు.

ములకలచెరువు ఎంపిడిఒగా పోలప్ప

ప్రజాశక్తి-ములకలచెరువు



బాధ్యతలు చేపడుతున్న పోలప్ప

ములకలచెరువు ఎంపిడిఒగా పోలప్ప బుధవారం బాధ్యతలు చేపట్టారు. శ్రీసత్యసాయి జిల్లా, కొత్తచెర్వు అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా పనిచేస్తూ పదోన్నతిపై ములకలచెరువు ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. గత ఆరు నెలల క్రితం బి.కొత్తకోటకు చెందిన ఇఓఆర్డి ఆశ్రిత ఇన్‌ఛార్జ్ ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నూతన ఎంపిడిఒ మాట్లాడుతూ మండలం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తా నన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు.

రాజకీయ కక్షతోనే కేసులు

ప్రజాశక్తి-కలికిరి

రాజకీయ కక్షతోనే అమాయకులపై కేసుల నమోదు చేసి వేధిస్తున్నారని రెడ్డి జెఎసి సంఘం ఆధ్వర్యంలో మదనపల్లి డిఎస్‌పి కె.కేశప్పకు ఫిర్యాదు చేసి అక్రమ కేసులు ఎత్తివేయాలని వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత నెలలో జరిగిన మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటన సందర్భంగా అంగళ్లు, పుంగనూరులో చోటు చేసుకున్న సంఘటనలకు బాధితులను చేస్తూ అమాయకులపై కేసు నమోదు చేయడాన్ని రెడ్డి జెఎసి తీవ్రంగా ఖండిస్తోందన్నారు. అంగళ్ళు, పుంగనూరు సంఘటనలప్పుడు వారు వారి వారి సొంత పనులు నిమిత్తం కలికిరి, పీలేరు ప్రాంతాల్లోనే ఉన్నారని, సాక్ష్యాలు, సిసి కెమెరాల ద్వారా అందుబాటులో ఉన్నాయని వాటిని నిశితంగా పరిశీలించి అమాయకులైన రెడ్డి జెఎసి సభ్యులను అక్రమ కేసుల నుంచి విముక్తి చేయాలని డిఎస్‌పిని కోరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి జెఎసి అధ్యక్షులు ఆదినారాయణరెడ్డి, కార్యదర్శి రాంప్రసాద్‌రెడ్డి, సభ్యులు శేషుకు మార్‌రెడ్డి, సహదేవరెడ్డి, వెంకటనారాయణ రెడ్డి, రాజారెడ్డి, ప్రతాపరెడ్డి, జెఎసి సభ్యులు పాల్గొన్నారు.

పాము కాటుతో మహిళా రైతుకు అస్వస్థత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



చికిత్స పొందుతున్న అలివేలు

పాము కాటేసి మహిళా రైతు అస్వస్థతకు గురైన సంఘటన బుధవారం పుంగనూరు మండలంలో చోటుచేసుకుంది. బాధితురాలి కుటుంబీకుల కథనం మేరకు.. పుంగునూరు మండలంలోని ఈడికిపల్లి సమీపంలోని మరసనపల్లికు చెందిన నారాయణ భార్య అలివేలు పొలం దగ్గర వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కాటేసి అస్వస్థతకు గురైనట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు గమనించి బాధితురాలిని మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించగా, ఆస్పత్రి అత్యవసర విభాగం వైద్యులు మెరుగైన వైద్యం అందించడంతో ప్రాణాపాయం తప్పి కోలుకుంటుంది.

ప్లేబ్యాక్ సింగర్ రాముకు సత్కారం

ప్రజాశక్తి-కడప అర్బన్

చెన్నైకి చెందిన ప్రముఖ ప్లే బ్యాక్ సింగర్ రామును కళాకారులు సి.హెచ్. బాబు, సూరిబాబు బుధవారం నగరంలో పాటకచేరిలో పాల్గొనడానికివచ్చిన రామును సత్కరించారు. ఈయన 200 సినిమా పాటలు, 5000 భక్తి సంగీతం పాటలు గానం చేశారు. తమిళ, తెలుగు, కన్నడ ,హిందీ, బడుగ భాషలలో పాటలు ఆలపించారు. పాడుతా తీయగా కార్యక్రమంలో పాటలు పాడి ప్రేక్షకుల మన్ననలు పొందారు. జెమినీ టీవీ నవరాగంలో స్టేట్ విన్నర్‌గా నిలిచారు. టివి సీరియల్‌లో పాటలు పాడినందుకు రెండుసార్లు నంది అవార్డులు గెలుచుకున్నారు. కడపకు వచ్చిన సందర్భంగా కళాకారులు సత్కరించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు.

ముగిసిన వరి ధాన్యం వేలం పాట

చాపాడు : గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం ద్వారా ఖరీఫ్ సీజన్‌లో రైతులకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉంచిన ఎన్‌డిఎల్ఆర్-7 రకం వరి ధాన్యాన్ని బుధవారం బహిరంగ వేలంపాట నిర్వహించినట్లు మండల వ్యవసాయ అధికారి మ్యాగీ తెలిపారు. ధాన్యాన్ని లక్ష్మీపేటకు చెందిన సుబ్బారెడ్డి దక్కించుకున్నారని ఆమె తెలిపారు.

'జగనన్నకు చెబుదాం'ను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

మండల కేంద్రంలో ఈనెల 22న స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణంలో కలెక్టర్ గిరీష ఆధ్వర్యంలో జరుగు జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మదనపల్లి డివి జన్ డిఎల్‌పిఒ లక్ష్మీపతి అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ శేషగిరిరావు, ఇఒపిఆర్‌డి చలపతిరావు, సింగిల్ విండో అధ్యక్షులు రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల అధికారులతో, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, వెల్ఫేర్‌అసిస్టెంట్లు, మహిళా సంరక్షణ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను పరిష్కరించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని తీసుకువచ్చారని అన్నారు. అందులో భాగంగా జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా అధికారులు ఆధ్వర్యంలో ప్రతి మండలంలోనూ స్పందనను నిర్వహించి ప్రజల నుంచి వచ్చిన వినతులను నిషితంగా పరిశీలించి వారు పరిష్కరించడం జరుగుతున్నాదని తెలిపారు. మండలంలో కూడా ఈ నెల 22న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి జగనన్నకుచెబుదాం ప్రత్యేక స్పందన కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహి స్తున్నామని అన్నారు. సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లు ఈ కార్యక్రమం పై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించి, వారికి దీర్ఘకాలంగా ఉన్నటువంటి సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వినతి పత్రం రూపంలో తీసుకురావాలన్నారు. ప్రజలు వారికున్న సమస్యలపై తగిన దృవపత్రాలను, ఆధార్ కార్డు ను పొందుపరచి వినతి పత్రం రూపంలో జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి ఒక్కరి సమస్యను వారు నిశితంగా పరిశీలిస్తారని, పరిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్, ఉద్యానవన శాఖ అధికారి ఈశ్వర్ ప్రసాద్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ సురేష్, ఏపీఓ రమేష్, హౌసింగ్ ఎఇ అమర్నాథ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డిఎల్‌పిఒ లక్ష్మీపతి

నగర పంచాయతీ అభివృద్ధిపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మనోహర్

ప్రజాశక్తి - బి.కొత్తకోట

స్థానిక నగర పంచాయతీ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై కమిషనర్ పి.ఆర్.మనోహర్ నగర పంచాయతీ కార్యాలయంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వైసిపి పలమనేరు నియోజకవర్గం పరిశీలకులు, మాజీ ఎంపిపి పాగొండ ఖలీల్‌అహ్మద్ సూచనలు, సలహాలతో నగర పంచాయతీ అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించారు. ఈ సందర్భంగా ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ ప్రతిరోజు ప్రజలకు నీరు రెండు గంటలసేపు వదిలేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.నాలుగు రోజులకు ఒకసారి నాలుగు గంటల సేపు నీరు వదిలే దానికంటే ప్రతిరోజు రెండు గంటలసేపు వదిలేందుకు కృషి చేయా లన్నారు. చాలా వరకు నీటి కొళాయిలకు ట్యాపులు లేవని, నీరు చాలా వృధా అయిపోతుందని, వెంటనే ట్యాపులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వీధిదీపాలు ఏర్పాటు చేసి, డ్రెయినేజీని ఎప్పటికప్పుడు శుభ్రపర చాలన్నారు. అధికారులు,ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి నగర పంచాయతీని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని సూచించారు. నగర పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని, భవిష్యత్తులో సహాయ సహకారాలతో మరింత అభివృద్ధి చేసుకుం దామని కమిషనర్‌కు తెలిపారు. సమావేశంలో మండల వైసిపి కన్వీనర్ ప్రదీప్‌రెడ్డి, మండల జెసిఎస్ సచి వాలయ కన్వీనర్‌రెడ్డి హరి, వైసిపి నాయకులు భీమగాని ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రచార కార్యదర్శి అయూబ్ బాషా, సచివాలయ కన్వీనర్లు సి.ఆర్.చిన్నికృష్ణ, జి.చాంద్‌బాషా, జీవి రామకృష్ణ, నక్క సంతోష్, వైసిపి నాయకులు అభిలాష్‌రెడ్డి, సాయి, సద్దాం, రాయలసీమ రమేష్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

ప్రజాశక్తి-పీలేరు



పీలేరు : ఊరేగింపు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

పట్టణంలో గణనాథుల ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాలు అట్ట హాసం గా జరిగాయి. వినాయక చవితి పండుగ సందర్భంగా సోమవారం పట్టణంలోని 130 కేంద్రాల్లో విభిన్న వినాయకుల విగ్రహాలను ప్రతిష్టించారు. మూడవ రోజైన బుధవారం విగ్రహాల నిమజ్జన కార్యక్రమానికి శ్రీకారం చుట్టడానికి ముందుగా పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయం ముందు పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్‌బాషా, జడ్‌పిటిసి ఏటి రత్నశేఖర్‌రెడ్డి, వైసిపి నాయకులు హాజరై మహా ఊరేగింపు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి కేంద్రం నుంచి కూడా నిర్వాహకులు రకరకాల వాయిద్య బృందాలు, కళాకారులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఊరేగింపులో కేరళ వాయిద్య బృందాల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఎలాంటి అవాం ఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు వీలుగా స్థానిక అర్బన్ సిఐ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గట్టి పోలీసు బందో బస్తు నిర్వహించారు. కార్యక్ర మాల్లో పిల్లలను అనుమతించకుండా తగిన జాగ్రత్తలు తీసు కున్నారు. ఊరేగింపు సందర్భంగా పాల్గొన్న భక్తులకు స్థానిక ఆర్యవైశ్యులు, కార్పెంటర్స్ అసోసియేషన్ విడివిడిగా అన్న ప్రసాదాల వితరణ కార్యక్రమాలను చేశారు.

వేలంలో రూ.58 వేలు పలికిన లడ్డూ

పుల్లంపేట : మండల పరిధిలోని రెడ్డిపల్లి పేట గ్రామంలో వినాయకచవితి మూడవరోజు నిమజ్జనం పురస్కరించుకొని భారీ స్థాయిలో లడ్డు వేలం పాట నిర్వహించార్డు. వేలం పాటకు ఆశవహులు ప్రయత్నించగా చివరికి రొంపిచర్ల నరసింహులు తండ్రి సుబ్బన్న రూ.58,500 రూపాయలకు వినాయక లడ్డును క్రైసవం చేసుకున్నారు. **గాలివీడు :** వినాయ చవితి సందర్భంగా మండంలోని ఏర్పాటు చేసిన విగ్రహాలను పోలీసు బందోబస్తు నడుమ కమిటీ సభ్యులు నిమజ్జనం చేశారు. అరవీడు గ్రామాన్ని పరిధిలో ఉన్న విగ్రహాలను కృషావతి మైనర్ ఇరిగేషన్ రిజర్వాయర్‌లో, గోరాన్‌చెరువు, గొట్టివీడు, గాలివీడు గ్రామాలలో కొన్ని విగ్రహాలను గాలివీడు పెద్ద చెరువులో, నూలివీడు, పేరంపల్లి ఆ ప్రాంతంలో విగ్రహాలను ఆగ్రామ చెరువులలో నిమజ్జనం చేశారని పేర్కొన్నారు. **తంబళ్లపల్లి :** మండలంలో ఊరురా వినాయక చవితి పండుగను కోలాహలంగా జరుపుకుంటున్నారు. గణేష్ యూత్ ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి సతీమణి కవితమ్మ సందర్శించారు. శ్రీరాములు, జగేంద్ర కుటుంబీకులు ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో కవితమ్మ భోజనం వడ్డించారు. బోయపల్లి, చేలూరు వాండ్లపల్లెలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల ఊరేగింపు నిర్వహించారు. యువకులు, మహిళలు పెద్ద ఎత్తున రంగుల చల్లుకుంటూ కేరింతల కొడుతూ చిన్నేరు ప్రాజెక్ట్ వద్దకు తీసుకెళ్లి విగ్రహాలను నిమజ్జనం చేశారు.



తంబళ్లపల్లి : అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి కవితమ్మ

జిపిఎస్ ఉద్యోగుల పాలిట ఉరితాడు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

రాష్ట్రంలోని దాదాపు 3.5లక్షల ఉద్యోగులు కోరుకునేది పాతపెన్షన్ విధానాన్ని అని, జిపిఎస్ కాదని ఎపి రాష్ట్ర ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బరాజు యాదవ్ అన్నారు. స్థానిక అనిబిసెంట్ ఉన్నత పాఠశాల ఆవరణలో బుధవారం నిర్వహించిన ఎస్‌టిఎఫ్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిపిఎస్‌పైన ప్రభుత్వం తీసు కొచ్చే బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఉద్యోగులకు ఇష్టంలేని ఈ జిపిఎస్‌ను బలవంతంగా రుద్దడాన్ని తాము ఒప్పుకోబోమని తెలిపారు. ప్రభుత్వం ఈ ప్రయత్నాన్ని మానుకొని మిగిలిని రాష్ట్రాల్లో అమలు చేసినట్లుగా పాతపెన్షన్ విధానాన్ని మాత్రమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఉద్యోగ ఉపాధ్యాయులతో పెద్దఎత్తున పోరాటాలు కొన సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు రామ్మో హన్, వినోద్ కుమార్, నరేష్, జోసఫ్, గుర్రయ్య, హరిరామకృష్ణ, లక్ష్మిచౌడయ్య పాల్గొన్నారు.

జగన్ పాలనలో సీమకు నవ మోసాలు

- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి

ప్రజాశక్తి - వేంపల్లె

జగన్ పాలనలో రాయలసీమకు నవ మోసాలు, నవద్రోహాలు జరిగినట్లు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి విమర్శించారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సిఎం జగన్‌రెడ్డి సీమ కష్టాలు తనకు తెలుసునంటూనే పదేపదే రాయలసీమకు మోసం చేయడం శోచనీయమన్నారు. సంజీవని లాంటి ప్రత్యేకహోదా అమలు కాలేదన్నారు. రాయలసీమకు కేంద్రం నుండి బుందేల్ ఖండ్ తరహాలో ప్రత్యేక అభివృద్ధి ప్యాకేజీకి తెప్పించలేదని చెప్పారు. కడప జిల్లాలో సెల్ ఆధ్వర్యంలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కాలేదన్నారు. కాంగ్రెసు ప్రభుత్వం శ్రీకాళహస్తి వద్ద ప్రారంభించిన మన్నవరం విద్యుత్ పరికరాల ఉత్పత్తి ప్రాజెక్టును మోడీ ప్రభుత్వం మూసి వేయగా అడ్డుకోలేదని చెప్పారు. శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారం కనీసం హైకోర్టు అయిన రాయలసీమలో ఏర్పాటు కావాల్సి ఉన్నా కాలేదన్నారు. రాజధానిని అమరావతి నుండి విశాఖకు తరలిస్తే దూరం కారణంగా ఎక్కువ నష్టం రాయలసీమ వాసులకే అన్నారు. కొంత మేరకు పనులు పూర్తయిన కడప-రాయచోటి-మదనపల్లె-బెంగళూరు బ్రాడ్‌గేజ్ రైలు మార్గాన్ని నిలుపుదల చేసి ఈ ప్రాజెక్టు వద్దని రైల్వే శాఖకు లేఖ రాయడం దుర్మార్గం అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌కు రాయలసీమ పట్ల చిత్తశుద్ధి, ప్రేమ ఉంటే నవ మోసాలు సరి దిద్దాలని తులసిరెడ్డి కోరారు.

నష్టపరిహారం త్వరగా అందివ్వాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - చాపాడు

బెంగళూరు-విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవేలో భూములు కోల్పోయిన మండల పరిధిలోని రైతులకు వెంటనే నష్టపరిహారం అందేలా చూడాలని జమ్మలమడుగు ఆర్‌డిఒ శ్రీనివాసులు సిబ్బందికి సూచించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆర్‌డిఒ సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైవేలో భూములు కోల్పోయిన రైతులకు చాలా మందికి నష్టపరిహారం ఇప్పటికే అందిందన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న రైతుల వివరాలను సేకరించి వెంటనే వారికి నష్టపరిహారం అందేలా చూడాలన్నారు. నష్టపరిహారం పంపిణీలో ఆలస్యం చేస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ సుభాని, డిటి యామిని, వీఆర్వోలు పాల్గొన్నారు.

పేదలకు వరం.. సిఎం సహాయనిధి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని వైసిపి కార్యాలయంలో బుధవారం ఆయన సిఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అయిదు మంది లబ్ధిదారులకు రూ.5 లక్షల 70 వేలు చెక్కులను అందజేశామన్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు చాలా ఉపయోగపడుతుందన్నారు. అనంతరం లబ్ధిదారులు ఎమ్మెల్యే ప్రత్యేక కృషికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర్‌రెడ్డి, వేపరాల ఎంపిటిసి కుమార్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు. **ప్రొద్దుటూరు :** సిఎం సహాయనిధి చెక్కులను బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ బి.లక్ష్మీదేవి, వైస్-చైర్మన్ బంగారురెడ్డి చెక్కులు పంపిణీ చేశారు. రూ.9లక్షల 90వేలు విలువ కలిగిన 9 చెక్కులను మున్సిపల్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా బంగారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు ఆదేశాల మేరకు చెక్కులను పంపిణీ చేశామన్నారు. రెండు రోజుల క్రితం ఒక పేద వ్యక్తికి రూ.25.70లక్షలు సిఎంఆర్‌ఎఫ్ కింద చెక్కును పంపిణీ చేశామన్నారు. మళ్లీ జగన్‌ను సిఎంను చేస్తే సమాజం మరింత ఆర్థికంగా పురోగతి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రామిరెడ్డిచెరువు సమీప కొండల్లో చిరుత సంచారం

ప్రజాశక్తి-చక్రాయపేట

మండలంలోని గడ్డంవారిపల్లె పంచాయతీ మూలపల్లె గ్రామం సమీపంలో ఉన్న రామిరెడ్డి చెరువు కొండల్లో చిరుతపులు సంచరిస్తున్నట్లు ఫారెస్ట్ డిఆర్ఒ గుర్రప్ప తెలిపారు. రెండు రోజుల క్రితం ఆ కొండల్లో చిరుతపులులు సంచరిస్తున్నాయనే సమాచారంతో వేంపల్లి అటవీ శాఖ అధికారులు గ్రామస్తులను అప్రమత్తం చేశారు. రామిరెడ్డి చెరువు వద్ద దట్టమైన అడవులు ఉండడం వల్ల పులులు ఉండే ఆస్కారం ఉంది. కాబట్టి అడవి లోపలికి గొర్రెల కాపరులు గాని, బర్రెల కాపర్లు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అటవీ శాఖ అధికారులు సూచించారు. బుధవారం ఫారెస్ట్ డిఆర్ఒ గుర్రప్ప తమ సిబ్బందితో రామిరెడ్డి చెరువు వద్దకు వెళ్లి పరి శీలించారు. చుట్టుపక్కల వారు అప్రమత్తంగా ఉండాలని వారు సూచించారు.



క్రీడాదుస్తులను చూపుతున్న ఉపాధ్యాయులు

విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ

ప్రజాశక్తి- పుల్లంపేట

మండల పరిధిలోని కొత్తలూరు పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం పాఠశాల ప్రధానో పాధ్యాయులు ఎస్.వెంకటసుబ్బరాజు తన సొంత నిధులతో పదివేల రూపాయలు విలువచేసే క్రీడా దుస్తులను ఉచితంగా అందించారు. విద్యార్థులు క్రీడల్లో బాగా రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. క్రీడా దుస్తులు అందించిన హెచ్ఎంకు వ్యాయామ ఉపాధ్యాయ బృందం కె.పార్థసారథి, పాఠశాల సిబ్బంది అభినందనలు తెలిపారు.

23న ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి-గాలివీడు

23 శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా కంటి వైద్యం నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ వైద్యాధికారి రఫిక్ పేర్కొన్నారు. అత్యాధునిక నేత్ర చికిత్స అందుబాటులో కంటి శుక్లంలో కుట్లు లేకుండా అతి చిన్న కోత ద్వారా శుక్లం గల వారికి శస్త్రచికిత్స ఉచితంగా చేస్తారని చెప్పారు.ఉచితంగా కంటిపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్ర చికిత్సకు నిర్వహిస్తారని చెప్పారు. కంటి వ్యాధులతో బాధపడే వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పుత్రిలో జరిగే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య చికిత్సతో పాటు మందులు ఉచింతగా అందిస్తారని చెప్పారు. వైద్య శిబిరానికి వచ్చే వారు ఆరోగ్యశ్రీ కార్డు, ఆధార్ కార్డు తమ ఒరిజినల్ కార్డుతో తప్పక హాజరు కావాలని సూచించారు.

క్రైం కార్నర్

నిప్పంటుకొని విభిన్న ప్రతిభావంతునికి గాయాలు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పెట్రోల్ బాటిల్‌కు నిప్పంటుకుని మంటలు చెలరేగడంతో విభిన్న ప్రతిభావంతుడు తీవ్రంగా గాయపడిన సంఘటన పెద్దతిప్పసముద్రం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు..మండలంలోని కుమ్మరోళ్లపల్లెలో నివాసముంటున్న విభిన్న ప్రతిభావంతుడు లక్ష్మీనారాయణ (56) కాలు కదపలేని స్థితిలో కుటుంబ పోషణ కోసం చిల్లర అంగడిలో పెట్రోల్, సరుకులు అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. మంగళవారం సాయంత్రం ఓ వ్యక్తికి పెట్రోల్ అమ్మి పక్కనే కూర్చొని బీడీ అంటించడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయన్నారు. కదలలేని స్థితిలో ఉన్న దివ్యాంగుడు లక్ష్మి నారాయణకు తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. కుటుంబీకులు బాధితుడిని చికిత్స కోసం 108లో మదనపల్లి జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. ఈ ఘటనపై పిటిఎం ఎస్ఐ రవీంద్రబాబు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వరకట్న వేధింపులకు గురి చేస్తున్నాడని వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పట్టణంలోని నివసిస్తున్న రామచంద్ర ఇచ్చిన ఫిర్యాదు మేరకు తన కుమార్తె మమత అదే ప్రాంతానికి చెందిన భాస్కర్ కుమారుడు చంద్రశేఖర్‌లు ప్రేమించుకోవడంతో గత యేడాది ఫిబ్రవరి నెలలో పెద్దల సమక్షంలో వివాహం జరిపించినట్లు చెప్పారని అన్నారు. రూ.లక్ష నగదు, 220 గ్రాముల బంగారును కట్న కానుకల కింద అందించినట్లు పేర్కొన్నారు. చంద్రశేఖర్ చదువుకుంటానని చెప్పడంతో మళ్లీ రూ.2లక్షలు వరకు నగదును తీసుకెళ్లి ఇప్పుడు నాకు రూ.12 లక్షలు ఇచ్చి ట్రాక్టర్‌ను తీసిస్తేనే కాపురం చేస్తానని లేదంటే విడాకుల పత్రం పై సంతకం చేయాలని చిత్రహింసలకు గురిచేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు. మంగళవారం రాత్రి పుట్టింటిలో ఉన్న మమతను విడాకుల పత్రంపై సంతకం పెట్టాలని వేధించడంతో మనస్తాపంతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబీకులు 108 వాహనంలో మదనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వినాయక మండపాల దగ్గర దొంగలు హల్‌చల్

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని రెడ్డిపల్లిపేట, అనంతంపల్లి పంచాయతీ జానకిపురం గ్రామాలలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన మండపాల వద్ద దొంగలు హల్‌చల్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. అనంతంపల్లి పంచాయతీ జానకిపురం గ్రామంలో వినాయకుని విగ్రహం దగ్గర రూ.20వేలు విలువ చేసి డీజే సౌండ్ సిస్టమ్‌ను దొంగిలించారని అన్నారు. అదే సమయంలో రెడ్డిపల్లిపేట గ్రామంలో ఐదు కేజీల వేలం లడ్డును తీసుకెళ్లారని చెప్పారు. రెండు చోట్ల చోరీకి పాల్పడిన ముఠా ఒకరే ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేయడంతో ఈ ఘటనపై కేసు నమోదు ధర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

యువకుడి మృతికి కారణమైన నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆటో ఢీకొని యువకుడు మృతి చెందిన కేసులో నిందితున్ని బుధవారం టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టుకు సంబంధించి ఎస్ఐ హేమాద్రి కథనం మేరకు వివరాలు.. ఈనెల 18 వ తేదీన రాత్రి స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌కు చెందిన రమణ కుమారుడు అరుణ్(23) సొంత పని మీద స్నేహితులు కలిసి ఆర్‌టిసి బస్టాండ్‌కి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా ఆటో బైక ఢీకొన్న సంఘటనలో అరుణ్ అక్కడికక్కడే దుర్మరణం చెందినట్లు తెలిపారు. గాయపడిన మరో యువకుడు స్థానిక జిల్లా ఆసుపత్రిలో కోలుకుంటున్నట్లు తెలిపారు.. ఈ కేసులో స్థానిక గౌతమినగర్‌లో నివాసమున్న ఆటో డ్రైవర్ రెడ్డికిషోర్ (22)ను బుధవారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్

- రూ.5 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

స్థానిక పట్టణంలోని పాయిరామన్నవీధిలో ఏర్పాటు చేసిన వినాయకుని మండపంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి సుమారు ఐదు లక్షల ఆస్తినష్టం వాటిల్లింది. పోలీసులు తెలిపిన మేరకు.. పట్టణం లోని పాయిరామన్నవీధిలో స్థానికులు వినయకచవితి ఉత్సవాలలో భాగంగా వినాయకున్ని ఏర్పాటు చేశారని అన్నారు. మండపం ఇరువైపులా ఉన్న వుడ్ వర్క్ షాపు, బార్బర్‌షాప్‌లు ఉన్నాయని చెప్పారు. అర్ధరాత్రి వేల విద్యుత్‌షార్ట్ సర్క్యూట్‌తో వినాయకుని విగ్రహం ఏర్పాటు చేసిన మంటపం కాలిపోయిందన్నారు. ఇరువైపులా ఉన్న దుకాణాలలో సామగ్రి దగ్ధమైపోయాయని చెప్పారు. ఈ సంఘటనలో సుమారు రూ.5లక్షల వరకు నష్టం జరిగినట్లు యజమానులు మహ్మద్ రఫీ, బార్బర్ షాప్ రవీంద్రలు వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైన దుకాణంలోని వస్తువులు